క్లుప్తంగా

గ్రామాలకు లింకురోడ్లు వేయండి



ఎమ్మెల్యే కసిరెడ్డితో కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: మండల పరిధి గ్రామాల్లో లింక్ రోడ్లు వేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాస్ శ్రీనివాసు రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన పలువురు నాయకులతో కలిసి ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలు గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీలు, మురుగు కాల్వలు, కమ్యూనిటీ భవనాలు తదితర వాటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నేత బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నేత్ర సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఘనంగా స్వామివారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మహేశ్వరం: మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. శ్రావణ నక్షత్రం సందర్భంగా ఆలయాన్ని పూలు, అరటి ఆకులు, కొబ్బరి మట్టలు, పచ్చ తోరణాలతో అలంకరించారు. ఉదయం అభిషేకం, అర్చన అనంతరం మధ్యాహ్నం ఆలయ పూజారీ పర్యవేక్షణలో శ్రీనివాస కల్యాణం జరిపించారు. వేడుకను వీక్షించేందుకు మామిడిపల్లి, జల్‌పల్లి భక్తులు తరలివచ్చారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

యాచారం: వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శంకర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నిమజ్జనం చేసేటప్పుడు విద్యుత్ సరఫరా, నీళ్లల్లో మునిగే సమయాల్లో భక్తులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సాగర్, శ్రీశైలం తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎంత మంది వెళ్తున్నారో సమాచారం ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు. భక్తులు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పితృవియోగం

ఇబ్రహీంపట్నం: ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడు, బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకుడు మంద సురేష్ తండ్రి నర్సింహ్మ అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తుర్కగూడలోని సురేష్ నివాసానికి వెళ్లి నర్సింహ్మ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, యువజన విభాగం అధ్యక్షుడు రాజు, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్, మార్కెట్ మాజీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

రశీదు తప్పనిసరి

17న రచ్చబండ
వినాయకుని లడ్డూ వేలం

చేవెళ్ల: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న రచ్చబండ వినాయకుని వేలంలో పాల్గొనే వారు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చేవెళ్ల రచ్చబండ వినాయక ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా ఈ రూల్ అమలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు నిర్ణయించిన విధంగా ఈ నెల 17వ తేదీన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా ఆరోజు రాత్రి జరిగే ఈ వేలానికి ప్రత్యేకత తెలిసిందే. ఈ లడ్డూ వేలం పాట ఒక్కోసారి రాష్ట్రస్థాయిలో, జిల్లాస్థాయిలో రూ. లక్షల్లో పలికి రికార్డులోకి వచ్చిన విషయాన్ని వారు గుర్తుచేశారు. అందుకే ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం రోజున వేలం పాటలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే వేలం పాటలో పాల్గొనే భక్తులు డిపాజిట్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. వేలం పాల్గొనే భక్తులు ముందుగానే ఉత్సవ కమిటీ నుంచి డిపాజిట్ రశీదును పొంది పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం

- ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ప్రమాదం జరగకముందే తొలగించాలంటున్న రైతులు





వెంకట్రావ్‌పేట్ గ్రామ శివారు పంటపొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

తలకొండపల్లి: పంటపొల్లాల్లో ఒరిగిన శిథిలావస్థ విద్యుత్ స్తంభాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు కూలి ఏప్రమాదం జరుగుతుందోనని వాపోతున్నారు. ప్రమాదవశాత్తు పోల్స్ నేల కూలితే.. ఆర్థిక నష్టంతో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని, మూగజీవాలకు ముప్పు వాటిల్లనుందని పేర్కొంటున్నారు. ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయి, సాగుపై ప్రభావం చూపనుందని వెల్లడించారు.

మరమ్మతులు లేక..

మండల పరిధి వెంకట్రావ్‌పేట్ శివారు ప్రాంతంలోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. సుమారు మూడు నాలుగు దశాబ్దాల క్రితం 11 కేవి విద్యుత్ వైర్లతో పోల్స్ ఏర్పాటు చేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు వాటికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వ్యవసాయ పనుల్లో నిత్యం పంట పొలాల్లో ఉంటామని, ఇలా ఒక వైపు ఒరిగిన స్తంభాలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. భయాందోళనతో సాగు పనులు చేసుకుంటున్నామని చెప్పారు. ఇదే విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కూలడానికి సిద్ధంగా ఉన్న స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు



పంట పొలాల మధ్య ఉన్న శిథిల విద్యుత్ స్తంభాల గురించి ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అవి కూలి ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోక ముందే కొత్తవి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– సైదుపల్లి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, వెంకట్రావ్‌పేట్

భయంగా ఉంది



పొలాల్లో కూలడానికి సిద్ధంగా ఉన్న కరెంటు స్తంభాలతో భయంగా ఉంది. ఎప్పుడు కూలుతాయోనని భయపడుతూనే పనిచేసుకుంటున్నాం. ప్రమాదవశాత్తు కూలితే 11 కేవీ వైర్లు తెగి పంట పొలాల్లో పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పాతవి తొలగించి.. కొత్తవి అమర్చాలి.

– దస్తగిరి, రైతు, వెంకట్రావ్‌పేట్

కొత్తవి లేవు..

విద్యుత్ స్తంభాలు ఒరిగిన విషయం మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం కొత్త పోల్స్ లేవు. మరో వారం రోజుల్లో ఒరిగిన వాటిని సరిచేయిస్తాం. కొత్తవి రాగానే వాటి స్థానంలో వీటిని అమర్చుతాం.

– ఏడీ శ్రీనివాసులు, ఆమనగల్లు, ఏఈ కఠారియా, తలకొండపల్లి

అధికారి లేక.. రిజిస్ట్రేషన్లు కాక..

- ఇబ్బంది పడుతున్న భూ క్రయవిక్రయదారులు
- నిలిచిన తహసీల్ కార్యాలయ సేవలు
- తహసీల్దార్‌ను నియమించాలంటున్న ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం

మాడ్గుల: ఉన్న అధికారిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించలేదు. కానీ.. మరో అధికారికి బాధ్యతలు అప్పగించారు. అతను సెలవులపై వెళ్లడంతో ఆ కార్యాలయ కార్యకలాపాలు పడకేసి.. ప్రజలకు ఇబ్బందిగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. మాడ్గుల తహసీల్దార్ సునీల్ రెండు నెలల కిందట కలెక్టరేట్ కార్యాలయానికి ఏకంగా బదిలీ కాగా.. ఉప తహసీల్దార్ రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. అనారోగ్యం కారణంగా ఆయన ఈ నెల 9 నుంచి సెలవుల్లో ఉన్నారు. దీంతో నాటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా.. పని నిమిత్తం వచ్చే ప్రజలు విషయం తెలుసుకుని వెనుదిరుగుతున్నారు. సెలవుల్లో ఉన్న అధికారి ఎప్పుడు విధుల్లో చేరతారోనన్న సమాచారం లేక పోవడంతో కొందరు రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకుంటున్నట్లు సమాచారం.

నిలిచిన లావాదేవీలు

తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటం, ఉప తహసీల్దార్ సెలవుల్లో వెళ్లడంతో పనులు కావడం లేదని ప్రజలు తెలిపారు. భూ రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకున్నవారు, క్రయవిక్రయ దారులు రిజిస్ట్రేషన్ చెయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. క్రయవిక్రయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయని ఆవేదన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్లు నిలిచి, అత్యవసరమై.. భూములు అమ్ముకున్నవారికి, కొనుగోలు చేసిన వారు సొమ్ము చెల్లించేందుకు వెనుకాడుతుండటంతో ఆర్థికంగా సతమతవుతున్నారని వెల్లడించారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే తహసీల్దార్‌ను నియమించాలని కోరుతున్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయండి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కమలనాథులు

మంచాల: బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి లోయపల్లి గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలను మరింత చైతన్య పరిచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, జిల్లా నాయకుడు కొండల్ ముదిరాజ్, స్థానిక నాయకులు బండి రాజు, శ్రీశైలం, వెంకటేశ్, రాజు, మహేశ్, గోపాల్ రాంచంద్రయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు



గాంధీభవన్ ఆవరణలో పార్టీ శ్రేణులు

కడ్తాల్: పీసీసీ అధ్యక్షుడిగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన మహేశ్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రం నుంచి పార్టీ శ్రేణులు గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలపడనుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కృష్ణనాయక్, మల్లేశ్‌గౌడ్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పల్లకీసేవ చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సాయీశ్వర్‌రెడ్డి, వేములబాల్‌రాజ్, నాగిళ్ల భవాని ప్రసాద్, నాగిళ్లకుమారస్వామి, పాండురంగారెడ్డి, పాలాదిశివకుమార్, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బడంగ్‌పేట్: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయకహిల్స్ కాలనీ కమ్యూనిటీ హాలులో కార్పొరేటర్ బోయపల్లి దీపిక, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా నివాసం ఉంటున్న ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేమని, వారి వలనే సమాజం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఉజ్జిని శ్రీధర్‌రావు, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కోశాధికారి శివకుమార్, కాలనీ పెద్దలు రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, కమలాకర్ రావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న షాబుద్దీన్ తదితరులు

కడ్తాల్: చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మక్తమాధారం గ్రామంలో నేను సైతం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఉత్సవ నిర్వాహకులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ కుల మతాలకతీతంగా జరుపుకొనే వేడుకల్లో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, లక్పతినాయక్, సత్యం, నర్సింహగౌడ్, నారాయణ, శ్రీకాంత్, శేఖర్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సెమినార్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తుక్కుగూడ: ఈ నెల 23, 24న మున్సిపాలిటీ కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దత్తు నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఫ్యాబ్‌సిటీ వద్ద కార్మికులతో కలిసి సెమినార్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ.. సెమినార్ మన ఆర్థిక వ్యవస్థ విధానం ప్రజల కోసమా, లాభాల కోసమా అనే అంశంపై రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి, చర్చిస్తామని వెల్లడించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ హాజరుకానున్నారని వెల్లడించారు. కార్మికులు అధికసంఖ్యలో రావాలన్నారు. సంఘం నాయకులు రాజు, యాదగిరి, సురేష్, భారతి, కల్పన, కృష్ణవేణి, అనురాధ, పాండు, భాను పాల్గొన్నారు.

ఆలూరు రోడ్డు గుంతల పూడ్చివేత



రోడ్డును చదును చేయిస్తున్న గ్రూప్ సభ్యులు

చేవెళ్ల: ఆలూరు రోడ్డు గుంతలను గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు పూడ్చివేయించారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం గుంతల మయంగా మారిందని, ఇదే విషయాన్ని పలుమార్లు అధికారులకు, పాలకులకు చెప్పిన పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారుల ఇబ్బందులను గుర్తించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు 35 ట్రాక్టర్లతో మట్టిని పోయించి చదును చేయించినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఈ సమస్యను ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లామని, దీంతో స్పందించిన ఆయన లారీ మట్టిని పోయించి కొన్ని గుంతలను పూడ్చివేయించినట్లు వెల్లడించారు. సుమారు రూ. 30వేల వరకు ఖర్చు చేసి, పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలోని హైస్కూల్‌వద్ద రోడ్డును బాగు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శేఖర్, రమేశ్, రాజు, మహేశ్, నవీన్, చిన్న, నాని, పృథ్విరాజ్, చింటూ, ప్రశాంత్, రాహుల్, శేఖర్, నర్సింలు, దప్పు రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: గణపతి పూజా కార్యక్రమంలో..



ఇబ్రహీంపట్నం: ఎల్మినేడులో..

విఘ్నాలు తొలగించు వినాయక..

చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా కొలువుదీరిన శివపుత్రున్ని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. 9వ రోజు అయిన ఆదివారం భక్తజనం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక విఘ్నాలు తొలగించవయ్యా అంటూ వేడుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: పూజలో పాల్గొన్న ఎస్‌ఐ వెంకటేశ్



మంచాల: గణపతి లడ్డూను రూ.61 వేలకు కైవసం చేసుకున్న భక్తులు



కడ్తాల్: ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో..



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేటలో..



కడ్తాల్: బాబూ జగ్జీవన్‌రాం యూత్ గణేశ్ మండపంలో..

పారిశుద్ధ్య లోపం..

విద్యార్థులకు శాపం

- వెంటాడుతున్న సీజనల్ వ్యాధుల భయం
- పేరుకుపోయిన చెత్తాచెదారం.. ముందుకుసాగని వ్యర్థ జలాలు..
- దుర్వాసనతో చదువుపై ఏకాగ్రత కోల్పోతున్న బాలికలు
- ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయ బృందం

సుమారు నాలుగు వందల మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్న సరస్వతి నిలయం పరిసర ప్రాంతంలో.. మున్సిపాలిటీ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తుంది. పూర్తిగా చెత్త నిండి, ముందుకు సాగని వ్యర్థ జలాలతో దర్శనమిస్తోంది. ఫలితంగా వెలువడుతున్న దుర్వాసనతో బాలికలు, ఉపాధ్యాయ సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.





పాఠశాల పక్కన చెత్తాచెదారం
కలుషిత నీటితో నిండి ఉన్న గొయ్యి

ఇబ్రహీంపట్నం: పట్నం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 400మంది చిన్నారులు చదువుకుంటున్నారు. అలాంటి విద్యాలయం పక్కన వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగల బెడద అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది. అసలే వానాకాలం. ఆపై సీజన్ వ్యాధులు ముసురే అవకాశం ఉండటంతో బాలికలతో పాటు.. ఉపాధ్యాయ బృందం భయాందోళన చెందుతోంది.

గోతులు తీసి.. వదిలేసి

పాఠశాల పక్కన గతంలో పట్నం ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ ఉండేది. దానిని తొలగించి ఐదేళ్ల క్రితం ఆ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించారు. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అనుకున్నట్లుగానే.. ఒకవైపున మడిగెలను నిర్మించారు. కానీ ప్రారంభించలేదు. మరోవైపు పాఠశాల పక్కనే మడిగెల నిర్మాణానికి భారీగా గోతులు తీసి వదిలేశారు. దీంతో ఆ గోతుల్లో వ్యర్థ జలాలు, చెత్త పేరుకుపోయి ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. పందులు సంచరిస్తున్నాయి.

విద్యార్థుల అవస్థ

అపరిశుభ్రతతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థాలతో వెలువడుతున్న దుర్వాసనతో కొందరు బాలికలు వాంతులు, వికారంతో బాధపడుతున్నారు. ఇలా బడిపక్కనే ఈ మేరకు అపరిశుభ్రత పేరుకుపోయినా మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దుర్వాసన భరించలేక పోతున్నాం



బడి పక్కన అపరిశుభ్రతతో ఇబ్బంది పడుతున్నాం. దుర్వాసన భరించలేక వాంతులు చేసుకుంటున్నాం. వికారంగా ఉంటుంది. పాఠశాల కిటికీలు మూసినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు కానరావటం లేదు. దీంతో చదువుపై ఏకాగ్రత చూపలేకపోతున్నాం. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలి.

– అఖిల, 9వ తరగతి

జ్వరాల బారిన పడుతున్నారు



చెత్తాచెదారంతో పాఠశాల పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. దుర్వాసన భరించలేకపోతున్నాం. వర్షం వచ్చిందంటే పాఠశాల అవరణలోకి భారీగా నీరు చేరుతుంది. దోమ కాటు వలన విద్యార్థినులు జ్వరాల బారిన పడుతున్నారు. బాలికలు చదువుపై ఏకాగ్రత చూపలేక పోతున్నారు. ఆటలపై ఆసక్తి కనబర్చడం లేదు.

– సుశీల, వ్యాయామ ఉపాధ్యాయురాలు